క్లుప్తంగా

9న అమ్మవారికి శ్రావణ మాసం పూజలు

ఒంగోలు మెట్రో: శ్రావణమాసాన్ని పురస్కరించుకుని స్థానిక గాంధీరోడ్డులోని వాసవీ కన్యకా పరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం సాయంత్రం ప్రత్యేక సామూహిక కుంకుమ పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు, వాసవీ కోలాట భజన మండలి సభ్యులు తెలిపారు. సాయంత్రం ఆది లక్ష్మీదేవికి నిర్వహించే కుంకుమ పూజలో మహిళలు పాల్గొని అమ్మవారి అనుగ్రహానికి పాత్రులు కావాలని కోరారు. పాల్గొనేవారు 98857 83281, 92983 00966, 89777 41414, 90303 23428 నంబర్లను సంప్రదించాలని సూచించారు.

పాఠశాలకు ల్యాప్‌టాప్ వితరణ



ల్యాప్‌టాప్ అందజేస్తున్న శ్రీగిరి చైర్‌పర్సన్ ఝాన్సీరాణి

ఒంగోలు మెట్రో: శ్రీగిరి విద్యా నిధి పథకం కింద శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులు పేర్నమిట్టలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలకు బుధవారం ల్యాప్‌టాప్ అందజేశారు. శ్రీగిరి శ్రీ వేంకటేశ్వరస్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి చైర్‌పర్సన్ ఆలూరు ఝాన్సీరాణి, శ్రీగిరి దేవస్థానం ఉత్తర అమెరికా ప్రతినిధి ఆలూరు శ్రీనివాసచరణరాజీవ్ తదితరులు పాల్గొన్నారు. తమ పాఠశాలకు ల్యాప్‌టాప్ అందజేసిన శ్రీగిరి దేవస్థానం నిర్వాహకులకు పాఠశాల నిర్వాహకులు, సిబ్బందిచ విద్యార్థులు కృతజ్ఞతలు తెలిపారు.

జారి పడి వ్యక్తికి తీవ్రగాయాలు

మద్దిపాడు: పొగాకు బ్యారన్‌పైకి ఎక్కి పని చేస్తూ జారిపడి ఒక వ్యక్తి తీవ్ర గాయాలపాలైన ఘటన బుధవారం మధ్యాహ్నం మండలంలోని వెంకట్రాజుపాలెం గ్రామంలో చోటుచేసుకుంది. జి.బ్రహ్మయ్య (42) బ్యారన్‌పైకి ఎక్కి పనిచేస్తూ పట్టుతప్పి కిందపడిపోవడంతో అతనికి గాయాలయ్యాయి. బ్రహ్మయ్య అపస్మారక స్థితిలోకి వెళ్లిపోవడంతో స్థానికులు మద్దిపాడు పీహెచ్‌సీకి తరలించి ప్రాథమిక చికిత్స అనంతరం ఒంగోలు రిమ్స్‌కు తీసుకెళ్లారు. బ్రహ్మయ్య పరిస్థితి విషమంగా ఉన్నట్లు సమాచారం.

ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులపై ప్రజావేదిక



ప్రజావేదిక నిర్వహిస్తున్న డ్వామా పీడీ అర్జునరావు

బేస్తవారిపేట: స్థానిక ఎంపీడీఓ కార్యాలయ ఆవరణలో 2023 ఏప్రిల్ నుంచి 2024 మార్చి నెల వరకు జరిగిన జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పనులపై ప్రజావేదిక కార్యక్రమం బుధవారం నిర్వహించారు. ఉపాధి హామీ పనులకు రూ.11 కోట్లు, పంచాయతీరాజ్ పనులకు రూ.6 కోట్ల పనులకు సంబంధించి పంచాయతీల్లో సోషల్ ఆడిట్ నిర్వహించారు. దీనిపై ప్రజావేదికను డ్వామా పీడీ అర్జునరావు నిర్వహించారు. ఈ సందర్భంగా పంచాయతీల్లో పనిచేస్తున్న ఫీల్డ్‌అసిస్టెంట్‌లను తొలగించేందుకు గ్రామాల్లోని టీడీపీ నాయకులు ఉపాధి హామీ పనులకు వచ్చిన వారిని రాలేదని, పాఠశాలల్లో స్వీపర్‌గా పనిచేస్తూ వేసవి సెలవుల్లో ఉపాధి పనులు పనిచేసిన తప్పు అన్నట్లుగా ప్రజావేదికలో ఆరోపణలు చేశారు. దీనిపై ఎంపీపీ, జెడ్పీటీసీలు గట్టిగా స్పందించడంతో రికవరీ లేకుండా వీఆర్వో విచారణకు ఆదేశాలిచ్చారు. జిల్లా విజిలెన్స్ అధికారి ఝాన్సీ, డ్వామా ఏపీడీ భాస్కరరావు, ఎంపీపీ వేగినాటి ఓసూరారెడ్డి, జెడ్పీటీసీ బీవీ రాజయ్య, ఎస్‌ఆర్‌పీ నందిని, ఎంపీడీఓ టి.పార్వతి, ఏపీఓ కుమార్ పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి ఆర్థికసాయం



నగదు అందచేస్తున్న చంద్రశేఖర్‌రెడ్డి

పొదిలి: నగర పంచాయతీ పారిశుధ్య కార్మికుడు గడ్డం చిన్న మస్తాన్ మృతి చెందగా మట్టి ఖర్చుల నిమిత్తం తక్షణ సాయంగా రూ.15 వేల నగదును కుటుంబ సభ్యులకు కమిషనర్ చంద్రశేఖరరెడ్డి అందజేశారు. కార్మికుని మృతదేహానికి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను పరామర్శించి, అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో శానిటరీ ఇన్‌స్పెక్టర్ మారుతీరావు, మేనేజర్ శ్రీకాంత్‌రెడ్డి, సీనియర్ అసిస్టెంట్ సురేంద్ర తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకార భరోసా ఏది.?



మత్స్య సంపద పడక ఒడ్డుకు చేరిన బోట్లు



చేపల వేట జరగక నిర్మానుష్యంగా ఉన్న సముద్రం

- మత్స్యకారులకు భరోసా నగదు ఊసెత్తని కూటమి ప్రభుత్వం
- ఎన్నికల వేళ రూ.20 వేలు ఇస్తామని కూటమి నాయకుల హామీ
- నేటికీ అందించకపోవడంపై మత్స్యకారుల అసంతృప్తి
- చేపల వేట విరామ సమయంలో అప్పులు తెచ్చుకుని జీవనం
- జగనన్న హయాంలో మత్స్యకార భరోసా ద్వారా రూ.10 వేలు జమ
- కొత్తపట్నం మండలంలోని మత్స్యకారులకు నాలుగు సంవత్సరాల్లో రూ.11.12 కోట్లు అందజేత
- ప్రస్తుతం నగదు అందక ఇబ్బందిపడుతున్న మత్స్యకారులు

కొత్తపట్నం: కూటమి ప్రభుత్వం మత్స్యకారులను నిలువునా ముంచేసింది. ఇప్పటి వరకు రూ.10 వేలు ఉన్న మత్స్యకార భరోసా నగదును రూ.20 వేలు ఇస్తామని ఎన్నికల సమయంలో హామీ ఇచ్చింది. కానీ, నేటికీ ఆ ఊసే ఎత్తడం లేదు. ఇప్పటికే అనేక పథకాలకు మంగళం పాడిన విధంగానే మత్స్యకార భరోసాకు కూడా ఎగనామం పెడతారేమోనన్న ఆందోళన మత్స్యకారుల్లో మొదలైంది. కూటమి ప్రభుత్వ మోసపూరిత చర్యలపై మత్స్యకారులు తీవ్రస్థాయిలో అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. చేపల వేట విరామ సమయంలో అప్పులు తెచ్చుకుని మరీ పూట గడుపుకుని మత్స్యకారులు జీవించారు. కూటమి ప్రభుత్వం మత్స్యకార భరోసా పథకం ద్వారా రూ.20 వేలు ఇస్తుందనే నమ్మకంతో అప్పులు చేసి కుటుంబాన్ని గడుపుకున్నారు. ప్రస్తుతం చేపల వేట విరామం అయిపోయి నాలుగు నెలలు కావస్తున్నా.. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండు నెలలు దాటినా.. ఇంత వరకు మత్స్యకార భరోసా గురించి పట్టించుకుంటున్న దాఖలు కనిపించడం లేదు. వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో ప్రతి ఏటా చేపల వేట విరామ సమయంలో మత్స్యకార భరోసా పథకం నగదును నేరుగా వారి ఖాతాకే అప్పటి సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జమచేశారు.

2019 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీ మేరకు.. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రి కాగానే మత్స్యకారులకు అండగా నిలిచారు. చేపల వేట నిషేధ సమయంలో రూ.4 వేలు ఉన్న నగదును రూ.10 వేలకు పెంచి క్రమం తప్పకుండా అందించారు. నాలుగు సంవత్సరాల్లో మొత్తం రూ.11.12 కోట్ల నగదును వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మత్స్యకారుల బ్యాంకు ఖాతాల్లో జమ చేశారు. వేటకు వెళ్లిన మత్స్యకారులు ప్రమాదశావత్తూ మరణిస్తే రూ.10 లక్షలతో కూడిన ప్రమాద బీమా వర్తించే విధంగా పథకం ప్రవేశపెట్టి అమలు చేశారు.

మత్స్యకారుల గురించి పట్టించుకోని ప్రస్తుత ప్రభుత్వం...

తాము అధికారంలోకి రాగానే మత్స్యకారులకు రూ.20 వేలు ఆర్థిక సహాయం చేస్తామని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి నేతలు ఎన్నికల సమయంలో ప్రకటించారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు నెలలు కావస్తున్నా.. ఇప్పటి వరకు మత్స్యకారులకు చిల్లిగవ్వ కూడా ఇచ్చిన పాపాన పోలేదు. ఇటు ప్రభుత్వం నగదు ఇవ్వక, అటు మత్స్య సంపద పడక ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు మత్స్యకారులు. ఎంత మందికి ఇస్తారో.. అసలు ఇస్తారో.. ఇవ్వరో అర్థం కావడం లేదని ఆందోళన చెందుతున్నారు. మత్స్యకార భరోసా నగదు ఇస్తారనే ధీమాతో దుకాణాల్లో అప్పులు తెచ్చి పూట గడుపుకున్నామని, వడ్డీలు చెల్లిస్తున్నామని చెబుతున్నారు. కూటమి ప్రభుత్వం ఇప్పటికైనా స్పందించి మత్స్యకార భరోసా కింద ఎన్నికల వేళ ఇచ్చిన హామీ మేరకు రూ.20 వేలు ఇవ్వాలని కోరుతున్నారు.

మత్స్యకారులను చిన్నచూపు చూడవద్దు



మత్స్యకారులను చిన్నచూపు చూడవద్దని కూటమి ప్రభుత్వాన్ని కోరుతున్నాం. వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం మత్స్యకార భరోసాను చేపల వేట విరామ సమయంలో క్రమం తప్పకుండా ఇవ్వడం వలన మత్స్యకారులు బాగా ఉపయోగించుకున్నారు. అందరూ అప్పట్లో సంతోషంగా ఉన్నారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ప్రచారంలో చెప్పిన విధంగా మత్స్యకార భరోసా కింద రూ.20 వేలను బ్యాంక్ అకౌంట్లలో జమ చేయాలి.

– గొల్లపోతు నాగార్జున, మూడు జిల్లాల మత్స్యకార కార్మిక సంఘ అధ్యక్షుడు, కె.పల్లెపాలెం

కూటమి ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలి



అధికారంలోకి వస్తే మత్స్యకారులకు రూ.20 వేలు ఇస్తామని కూటమి నాయకులు ఎన్నికల సమయంలో హామీ ఇచ్చారు. దీనిని నమ్మి జనం ఓట్లు వేశారు. ఇప్పుడు ప్రస్తుతం పూట గడవడానికి డబ్బులు లేక మత్స్యకారులు అప్పులు తెచ్చుకుంటున్నారు. మత్స్య సంపద కూడా పడక అల్లాడుతున్నారు. వెంటనే ప్రభుత్వం మత్స్యకార భరోసా కింద రూ.20 వేలు ఇవ్వాలని కోరుతున్నాను.

– విశ్వనాథపల్లి ఆనందరావు, సర్పంచ్, కె.పల్లెపాలెం

10న ఉచిత కంటి వైద్య శిబిరం

నాగులుప్పలపాడు: కామ్రేడ్ మాదాసు కృష్ణమూర్తి 16వ వర్ధంతి సందర్భంగా ఉప్పుగుండూరు గ్రామంలోని కాపు కళ్యాణ మండపం వద్ద శంకర కంటి ఆస్పత్రి ఆధ్వర్యంలో ఈ నెల 10వ తేదీ ఉచిత కంటి వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఉచితంగా కంటి పరీక్షలు చేయడంతో పాటు మందులు ఉచితంగా అందజేయనున్నట్లు తెలిపారు. వైద్య పరీక్షల అనంతరం ఆపరేషన్లు అవసరమైన వారికి ఉచితంగా ఆస్పత్రి వారే ఆపరేషన్లు చేయనున్నట్లు తెలిపారు.

14న మండల సర్వసభ్య సమావేశం

మద్దిపాడు: మండల సర్వసభ్య సమావేశాన్ని ఈ నెల 14వ తేదీ ఉదయం 10 గంటలకు ఎంపీడీవో కార్యాలయంలోని సమావేశ మందిరంలో నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, సొసైటీ అధ్యక్షులు, మండల స్థాయి అధికారులు పాల్గొనాలని కోరారు. అధికారులు తమ శాఖ ప్రగతి వివరాలతో రావాలని ఆయన కోరారు.

తహసీల్దార్‌ను కలిసిన రేషన్ డీలర్లు



తహసీల్దార్‌కు బొకే ఇచ్చి అభినందనలు తెలుపుతున్న రేషన్ డీలర్లు

మద్దిపాడు: మండలంలోని రేషన్ డీలర్లు బుధవారం ఉదయం తహసీల్దార్ సుజన్‌కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. మండల రేషన్ షాపుల డీలర్ల సంఘం నాయకుడు కారుమూడి చింపిరయ్య ఆధ్వర్యంలో డీలర్లు తహసీల్దార్‌కు శాలువా కప్పి బొకే ఇచ్చి అభినందనలు తెలిపారు.

పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి

- నగరపాలక సంస్థ కమిషనర్ జశ్వంతరావు

ఒంగోలు సెంట్రల్: నగరంలో పారిశుధ్యంపై ప్రత్యేక శ్రద్ధ వహించి సమష్టి కృషితో ప్రజలకు మెరుగైన సేవలు అందించాలని నగరపాలక సంస్థ కమిషనర్ జశ్వంతరావు అన్నారు. స్థానిక నగర పాలక సంస్థ కార్యాలయంలోని కమిషనర్ చాంబర్‌లో నగరంలోని పారిశుధ్య పనులపై అసిస్టెంట్ కమిషనర్, మున్సిపల్ హెల్త్ ఆఫీసర్, డిప్యూటీ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్, అసిస్టెంట్ ఇంజినీర్లు, శానిటరీ సూపర్‌వైజర్లు, 70 సచివాలయాల పరిధిలోని వార్డు శానిటరీ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలతో బుధవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కమిషనర్ జశ్వంతరావు మాట్లాడుతూ ఒంగోలు నగరంలో మార్పు తేవడం కోసం పారిశుధ్య పనులు, ఇంటింటి నుంచి వ్యర్థాల సేకరణ, నీటి సరఫరా, వీధి దీపాల పర్యవేక్షణకు ప్రత్యేక బృందాలు ఏర్పాటు చేస్తున్నట్లు చెప్పారు. ఆగస్టు 8 నుంచి అక్టోబర్ 10వ తేదీ వరకు మూడు రోజులకు ఒక డివిజన్ చొప్పున స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్లు తెలిపారు. వార్డు శానిటేషన్ అండ్ ఎన్విరాన్మెంట్ సెక్రటరీలు నగరంలో బ్లాక్ స్పాట్లను గుర్తించి ప్రతిరోజూ శుభ్రం చేయాలని కోరారు. ఎక్కడా చెత్తకుప్పలు లేకుండా చూడాలన్నారు. గార్బేజ్ వెహికల్ ద్వారా ఇంటింటికి తిరిగి చెత్త సేకరించాలని కోరారు. పారిశుధ్య పనులు, రోడ్లపై చెత్త, కాలువల్లో పూడికతీత పనులను ప్రతిరోజూ ప్రణాళికాబద్ధంగా చేయాలని చెప్పారు. ప్రజలు కూడా సహకరించాలని కోరారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై నగర ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు.



మాట్లాడుతున్న కమిషనర్ జశ్వంతరావు

చేనేత రంగానికి ప్రభుత్వం చేయూత

ఒంగోలు అర్బన్: చేనేత రంగానికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా ఉండి చేయూతనిస్తోందని స్థానిక ఎమ్మెల్యే దామచర్ల జనార్దన్‌రావు అన్నారు. బుధవారం ప్రకాశం భవనం వద్ద జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చేనేత, జౌళి శాఖ ఏర్పాటు చేసిన కార్యక్రమాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. తొలుత ప్రకాశం భవనం ప్రాంగణంలో ఏర్పాటు చేసిన ప్రత్యేక చేనేత వస్త్రాల స్టాల్‌ను ప్రారంభించారు. అనంతరం చేనేత రంగంపై అవగాహన కల్పించేలా ఏర్పాటు చేసిన ర్యాలీని ప్రారంభించారు. కలెక్టరేట్ నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా చేనేత మగ్గం వినియోగించి వస్త్రాలు తయారు చేసే పలువురుని సత్కరించారు. కార్యక్రమంలో ఎమ్మెల్యేతో పాటు నగర మేయర్ గంగాడ సుజాత, చేనేత జౌళి శాఖ ఏడీ ఉదయ్‌కుమార్, రియాజ్ నేత కార్మికులు పాల్గొన్నారు.

చట్టాలపై అవగాహన పెంచుకోవాలి

- సీనియర్ సివిల్ జడ్జి శ్యాంబాబు

కొత్తపట్నం: బాల్యం నుంచే చట్టాలపై అవగాహన పెంచుకుంటే విలువలతో కూడిన విద్యనభ్యసించి ఉన్నత శిఖరాలు అధిరోహించవచ్చని న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి, సీనియర్ సివిల్ జడ్జి కె.శ్యాంబాబు తెలిపారు. మండలంలోని మోటుమాలలో ఉన్న కస్తూర్బా గాంధీ బాలికల వసరుల కేంద్రాన్ని బుధవారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో ఏర్పాటు చేసిన సమావేశంలో న్యాయమూర్తి మాట్లాడారు. బాలికలకు గుడ్‌టచ్, బ్యాడ్ టచ్, బాల్య వివాహాలను అరికట్టడం గురించి వివరించారు. సమాజంలో వస్తున్న మార్పులు, విద్యార్థులపై సోషల్ మీడియా ప్రభావం ఏ విధంగా ఉంటుందో అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. కౌమార దశలో ఉన్న విద్యార్థినులు ఆరోగ్యంపై ప్రత్యేక దృష్టి సారించాలని సూచించారు. ఎటువంటి సమస్యలనైనా అధ్యాపకుల దృష్టికి, తల్లిదండ్రుల దృష్టికి తీసుకురావాలని చెప్పారు. తద్వారా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా నిరోధించవచ్చని తెలిపారు. విద్యార్థి దశలోనే మంచి అలవాట్లు నేర్చుకోవాలని సూచించారు. బాలికలకు ప్రభుత్వం అనేక సదుపాయాలు కల్పించిందని, సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. మీ మనసంతా చదువుపైనే ఉంటే అనుకున్నది తప్పనిసరిగా సాధించవచ్చన్నారు. న్యాయమూర్తి భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో ఎంఈవో–2 పద్మావతి, అధ్యాపకులు, బాలికలు పాల్గొన్నారు.



మోటుమాల కేజీబీవీలో భోజనాన్ని రుచి చూస్తున్న జడ్జి శ్యాంబాబు

వ్యవసాయానికి అనుబంధంగా ఉపాధి పనులు

నాగులుప్పలపాడు: గ్రామాల్లో ఉపాధి పని అనేది రైతులకు ఉపయోగకరంగా వ్యవసాయానికి అనుబంధంగా ఉండేలా చర్యలు చేపట్టాలని డ్వామా ఏపీడీ వెంకటస్వామి అన్నారు. బుధవారం స్థానిక ఉపాధి కార్యాలయంలో సిబ్బందితో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పండ్ల తోటల పెంపకం, గ్రామాల్లో రోడ్లకు ఇరువైపులా చెట్ల పెంపకం, ప్రభుత్వ భవనాల సముదాయంలో మొక్కల పెంపకం కార్యక్రమాలకు ఉపాధి పనుల్లో అధిక ప్రాధాన్యత ఇచ్చి ప్రతిపాదనల ఆమోదం కోసం డ్వామా కార్యాలయానికి పంపించి అనుమతులు తీసుకోవాలని సూచించారు. ఆయా పనులను వెంటనే ప్రారంభించాలన్నారు. అలాగే, ప్రభుత్వం కొత్తగా కాటిల్ షెడ్స్ మంజూరు చేసే నిమిత్తం మండలాలకు ఇచ్చిన టార్గెట్ ప్రకారం ప్రతిపాదనల ఆమోదం కోసం డ్వామా కార్యాలయానికి పంపించాలన్నారు. విధుల పట్ల ఎవ్వరూ నిర్లక్ష్యంగా ఉన్నా చర్యలు తప్పవని హెచ్చరించారు. సమావేశంలో ఏపీవో రవి, ఈసీ విజయకుమారి, టీఏలు, ఎఫ్‌ఏలు పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న ఏపీడీ వెంకటస్వామి

కౌలు రైతు గుర్తింపు కార్డులు జారీ చేయాలి

నాగులుప్పలపాడు: గ్రామాల్లో అర్హత ఉన్న ప్రతి కౌలు రైతుకు గుర్తింపు కార్డులు జారీ చేయాలని తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ అన్నారు. కౌలు రైతుల గుర్తింపు కార్డుల జారీపై బుధవారం స్థానిక వ్యవసాయశాఖ కార్యాలయంలో వీఆర్వోలు, వ్యవసాయ సహాయకులకు నిర్వహించిన సమావేశంలో తహసీల్దార్ మాట్లాడారు. కౌలు రైతు గుర్తింపు కార్డుల కోసం వ్యవసాయ సహాయకులు అర్హత ఉన్న రైతులను గుర్తించి ఆ సమాచారాన్ని సంబంధిత వీఆర్వోకు అందజేస్తే వారికి కౌలు రైతు గుర్తింపు కార్డులు మంజూరు చేయడం జరుగుతుందన్నారు. గుర్తింపు కార్డులు కేవలం 11 నెలల కాలపరిమితితో ఉంటాయని తెలిపారు. ఈ విషయంపై రైతులకు కూడా అవగాహన కల్పించాలన్నారు. ఇప్పటి వరకు మండలంలో 322 కౌలు రైతు కార్డులు జారీ చేసినట్లు తెలిపారు. సమావేశంలో వ్యవసాయాధికారి వెంకట్రావు, సిబ్బంది పాల్గొన్నారు.



సిబ్బందితో మాట్లాడుతున్న తహసీల్దార్, వ్యవసాయాధికారి

సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షునిగా రవికుమార్‌రెడ్డి



రవికుమార్‌రెడ్డికి నియామక పత్రం అందించి అభినందిస్తున్న అధ్యక్షుడు, ఉద్యోగులు

ఒంగోలు టౌన్: గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల సమాఖ్య రాష్ట్ర ఉపాధ్యక్షునిగా పి.రవికుమార్‌రెడ్డి నియమితులయ్యారు. ఒంగోలులోని బొల్లినేనివారిపాలెం వెల్ఫేర్ సెక్రటరీగా పనిచేస్తున్న రవికుమార్ రెడ్డిని పలువురు అభినందించారు. అదేవిధంగా సమాఖ్య ఉమెన్ వింగ్ సెక్రటరీగా ఒంగోలుకు చెందిన మహిళా పోలీస్ గద్దల అనూషను ఎన్నుకున్నారు. విజయవాడలో వీరి ఎన్నిక అనంతరం సచివాలయశాఖ డైరెక్టర్ ఎం.శివప్రసాద్‌ను కలిసి సచివాలయ ఉద్యోగుల సమస్యలపై వినతిపత్రం అందించారు.

పిల్లలకు భోజనం ప్యాకెట్ల పంపిణీ



పిల్లలకు భోజనం ప్యాకెట్లు పంపిణీ చేస్తున్న కేశవ

కొత్తపట్నం: మండలంలోని కొన్ని ప్రాంతాల్లో ఉన్న నిరుపేద కుటుంబాలను గుర్తించి ఆకలితో అలమటిస్తున్న పిల్లలకు మదర్ థెరిస్సా హెల్పింగ్ ఆర్గనైజేషన్ ఆధ్వర్యంలో బుధవారం భోజనం ప్యాకెట్లు పంపిణీ చేశారు. వారి ఇంటికెళ్లి భోజనాలతో పాటు స్నాక్స్ కూడా పంపిణీ చేశారు. మదర్ థెరిస్సా వ్యవస్థాపకుడు, ఆర్గనైజర్ డి.కేశవ సోదరి బి.మేనక నాలుగో వర్ధంతి సందర్భంగా కేశవ సొంత నిధులతో పంపిణీ చేశారు. కార్యక్రమంలో హెల్పింగ్ టీమ్ సభ్యులు డి.కేశవ, ఎం.సునీల్, రజిత్ తదితరులు పాల్గొన్నారు.

కౌలు రైతులకు కౌలుకార్డులు ఇవ్వాలి

కొమరోలు: మండలంలోని అర్హులైన కౌలు రైతులకు తప్పనిసరిగా కౌలు కార్డులు అందించాలని తహసీల్దార్ మల్లికార్జుననాయుడు తెలిపారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో మండలంలోని ఏఈఓలు, రెవెన్యూ సిబ్బందితో బుధవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మల్లికార్జున నాయుడు మాట్లాడుతూ సీసీఆర్‌సీ చట్టం ప్రకారం మండలంలోని ప్రతి ఒక్క కౌలు రైతుకు తప్పనిసరిగా కౌలు కార్డులు ఇవ్వాలన్నారు. మండలంలో 950 సీసీఆర్‌సీ కార్డులివ్వాలని కలెక్టర్ ఆదేశించగా ఇప్పటి వరకు 555 కార్డులు మాత్రమే ఇచ్చినట్లు తెలిపారు. ఈ ప్రక్రియను మరింత వేగవంతం చేయాలన్నారు. మండల వ్యవసాయశాఖ అధికారి రాజశ్రీ పాల్గొన్నారు.

అక్రమంగా తరలిస్తున్న గోవులు స్వాధీనం

గిద్దలూరు రూరల్: కంటైనర్ లారీలో అక్రమంగా తరలిస్తున్న 89 గోవులను బీజేపీ టౌన్ ప్రెసిడెంట్ అప్పిశెట్టి ఉదయ్‌శంకర్ ఆధ్వర్యంలో బుధవారం తెల్లవారు జామున పట్టణంలోని కుమ్మరాంకట్ట సెంటర్ వద్ద అడ్డుకున్నారు. అనంతరం ఆయన స్థానిక పోలీసులకు సమాచారం అందించారు. సీఐ వైవీ సోమయ్య సంఘటన స్థలం వద్దకు చేరుకుని అక్రమంగా తరలిస్తున్న గోవులను మార్కెట్ యార్డుకు తరలించారు. హనుమాన్ జంక్షన్ నుంచి హిందూపూర్ కోతకు వెళ్తున్న గోవులను రక్షించి సురక్షితంగా బయటకు తీశారు. గోసంరక్షణ చట్టం అమలులో ఉందని పోలీసులు తెలిపారు.